గురువుల బదిలీల్లో సాంకేతిక సమస్యలెన్నో

- హేతుబద్ధీకరణ పాయింట్లపై స్పష్టత కరువు
- నేటితో ముగియనున్న దరఖాస్తుల ప్రక్రియ
- నియోజకవర్గంలో 178 మంది తప్పని సరి బదిలీలు
- 49 మంది మిగులు ఉపాధ్యాయులు గుర్తింపు
- 8 ఏళ్ల సీలింగ్ నిబంధన తొలగించాలని డిమాండ్



ఆన్‌లైన్‌లో కేటాయించిన పాయింట్లను తనిఖీ చేస్తున్న గణపవరం ఎంఈఓ జి. బాలయ్య



ఉంగుటూరు ఎంఈవో కార్యాలయం వద్ద సేవలందిస్తున్న యూనియన్ నేతలు

నిడమర్రు: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభించినప్పటి నుంచి విద్యాశాఖలో రోజుకో సమస్య ఎదురవుతోంది. బదిలీలకు సంబంధించి ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ విద్యాశాఖ ప్రారంభించింది. ఇప్పటికే ప్రతి ఉపాధ్యాయుని సర్వీస్‌కు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయుల సమాచార వ్యవస్థకు (టీఐఎస్)కు అనుసంధానించారు. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బదిలీ దరఖాస్తు చేసుకున్న వెంటనే బదిలీలకు సంబంధించిన పాయింట్స్ ఆటోమేటిక్‌గా జనరేట్ అవుతున్నాయి. ఇక్కడే ఆన్‌లైన్‌లో కేటాయించిన పాయింట్స్‌పై 40 శాతం పైగా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ సమస్య ప్రతి రోజు వెంటాడుతున్నట్లు వారు చెపుతున్నారు. హేతుబద్ధీకరణ పాయింట్స్ కేటాయింపు, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయుల నిష్పత్తి 1:49 ఖాళీలు, రీఅపార్షన్ మెంట్ గురైన వారికి ఓల్డు స్టేషన్ పాయింట్లు రాకపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్‌ల దరఖాస్తుల ప్రక్రియ ముగియగా, 27వ తేదీ వరకూ ఎస్జీటీల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 467 ఆన్‌లైన్ దరఖాస్తులు ఉపాధ్యాయుల నుంచి అందాయని. వీటిలో తప్పని సరిబదిలీ ఉపాధ్యాయులు 178 మంది ఉన్నారు. వీరిలో హేతు బద్ధీకరణకు 49 మంది గుర్తైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉపాధ్యాయుల అనుమానాలు, సమస్యలు పరిష్కరించేందుకు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆయా మండల ఎంఈవో కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంటున్నారు.

బదిలీల వివరాలు ఇలా..

మండలం	నేటి వరకూ దరఖాస్తులు	తప్పని సరి బదిలీ టీచర్స్	మిగులు టీచర్స్
గణపవరం	135	28	15
నిడమర్రు	62	19	07
ఉంగుటూరు	172	75	19
భీమడోలు	98	56	08
మొత్తం	467	178	49

హేతుబద్ధీకరణ పాయింట్లపై గందరగోళం

తాజాగా 12రకాల బడులు విధానంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల పోస్టులు కేటాయించనున్నారు. దీని ప్రకారం విద్యార్థులు ఉపాధ్యాయుల నిష్ప త్తి ఆధారంగా పోస్టులు మంజూరు చేశారు. దీంతో నియోజకవర్గంలో బదిలీల చట్టం ప్రకారం మంది 49 మంది మిగులు ఉపాధ్యాయులుగా లెక్క తేల్చారు. వీరికి హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) పాయింట్లు కేటాయించాల్సి ఉంది. విద్యార్థుల సంఖ్య నేపథ్యంలో రేషనలైజేషన్ ప్రక్రియ మేరకు ఏర్పడిన మిగులు ఉపాధ్యాయ పోస్టులకు ఇచ్చే బదిలీ పాయింట్ల వివరాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో చూపించక పోవడంతో గురువులను ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకు వెళ్లగా ఎంఈఓ లాగిన్‌లో ఈ అంశం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు.

స్టేషన్ పాయింట్స్ సీలింగ్‌పై వ్యతిరేఖత

ఒకే స్కూల్లో 8 ఏళ్లకు పైగా పని చేసిన వారికి తొలి ఎనిమిదేళ్లకు మాత్రమే స్టేషన్ పాయింట్లు ఇచ్చి మిగిలిన సర్వీసును పరిగణలోకి తీసుకోకుండా సీలింగ్ విధించడాన్ని టీచర్స్ వ్యతిరేఖిస్తున్నారు. దీంతో కేటగిరి 3, 4లలో పనిచేసిన ఉపాధ్యాయులు ఈ సీలింగ్ విధానంలో ఆరు నుంచి ఎనిమిది పాయింట్ల వరకు నష్టపోతున్నట్లు చెబుతున్నారు. మరి కొంత మంది ఉపాధ్యాయులైతే 2023లో బదిలీ అయిన ప్రస్తుత విద్యావిధానం వల్ల కేషనలైజేషన్‌కు గుర్తై.. 8 ఏళ్ల సీలింగ్ విధానంలో తిరిగి దూరప్రాంతాలకు వెళ్లిపోతామని భయపడుతున్నారు.

పాయింట్ల సమస్య పరిష్కరించాలి



దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్న పాయింట్ల సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశాం. వితంతు, విడాకులు తీసుకున్న వారికి స్పెషల్ పాయింట్స్ ప్రివ్యూలో కనపడుతున్నాయి. సబ్మిట్ చేసిన తర్వాత కనబడటం లేదు, స్టేషన్ పాయింట్స్ సీలింగ్, అవి వివాహిత మహిళలకు 40 సంవత్సరాల నిబంధన ఎత్తి వేయాలి.

– డి. జోగినాయుడు, ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

ఎడిట్ అవకాశం ఎంఈఓ లాగిన్‌కు



బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల్లో మార్పులకు, చేర్పులకు ఎంఈఓ లాగిన్‌లో ఉన్నత అధికారులు ఎడిట్ అవకాశం కల్పించారు. బదిలీల దరఖాస్తులో నిబంధనల ప్రకారం పాయింట్స్ ఆన్‌లైన్‌లో కేటాయించనట్లెతై సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఎంఈఓ కార్యాలయంకు వస్తే సమస్య పరిష్కరిస్తున్నాం. ఈనెల 27 వరకూ ఎస్జీటీలకు దరఖాస్తులకు అవకాశం ఉంది.

– ఇ.శ్రీనివాసరావు, ఎంఈవో–1, నిడమర్రు

క్లుప్తంగా

దాసాంజనేయ స్వామికి విశేష పూజలు



దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని కొవ్వలి దాసాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కామిరెడ్డి నాని హనుమాన్ జయంతి ముగింపు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ఠ అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



దారపురెడ్డి రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: ఉప్పాకపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త దారపురెడ్డి రాములు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ బూత్ వింగ్ సెక్రటరీ యెలిశెట్టి పాపారావు బాబ్జిలు సోమవారం ఉప్పాకపాడు వెళ్ళి రాములు కుమారుడు సోమేశ్వరరావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పాకపాడు సర్పంచ్ నేదూరి వీర వెంకట మురళీ మోహన్, కురసాల అచ్చుతరావు, గోపి శెట్టి రామకృష్ణ, సత్తి పల్లారావు, నూదూరి శ్రీనివాసరావు, గులిపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

రామకృష్ణకు సత్కారం



రామకృష్ణను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

దెందులూరు: మండల బూత్ కన్వీనర్ నుంచి దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్‌గా నియమితులైన తలారి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ ను పోతునూరు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. రామకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తనకు నియోజవర్గ పదవి రావడానికి కృషి చేసిన దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, పార్టీ నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

కొయ్యలగూడెంలో అగ్ని ప్రమాదం

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో సోమవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. (శ్రీమన్నారాయణ నగర్) ఆరెంజ్ ల్యాబ్‌కు ఆనుకొని ఉన్న పాత సామగ్రి విక్రయ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించింది,. పాత సామగ్రి క్రయ విక్రయాలు నిర్వహించే కుటుంబం అక్కడే స్థిరంగా నివాసం ఉంటున్నారు. వంట చేసే సమయంలో పోపు పెడుతుండగా మంటలు వ్యాపించాయని దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా మంటలు వ్యాపించాయని బాధిత కుటుంబం తెలిపింది. పాత సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతి అయింది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నష్టం విలువ అంచనా వేయాల్సి ఉందని అధికారులు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చింతలపూడి: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ఆదేశించారు. చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు ఆసుపత్రికి అవసరమైన సదుపాయాలపై వినతిపత్రం అందజేశారు.

రజక మహిళా సంఘ జిల్లా అధ్యక్షురాలిగా ప్రసన్న

కొయ్యలగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘ మహిళా జిల్లా అధ్యక్షురాలిగా తనను నియమించినట్లు బయ్యనగూడెం గ్రామానికి చెందిన మెట్ట లక్ష్మీప్రసన్న సోమవారం తెలిపారు. ఏలూరులో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య తనకు నియామక పత్రాన్ని నాయకులతో కలిసి అందజేశారన్నారు. రజక వృత్తి చేసుకోవడానికి సాగునీటి చెరువులు అనుకూలంగా లేవని ప్రభుత్వం చెరువుల వద్ద దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



శిక్షణ తరగతుల్లో విద్యార్థులతో నీతికథలు చెప్పిస్తున్న గ్రంథాలయాధికారి



పెదపాడు శాఖా గ్రంథాలయంలో గణితంపై శిక్షణ అందజేస్తున్న రిసోర్స్‌పర్సన్

దెందులూరు: గ్రంథాలయాలు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. సోమవారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు. చదవడం, వినటం, రాయటం మూడు ప్రతి విద్యార్థికి అత్యంత ముఖ్యమైన అంశాలన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా వచ్చిన విద్యార్థులను అభినందించారు. శిక్షణ తరగతులలో జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు తరగతులు ముగిసిన తర్వాత ప్రజాప్రతినిధులు అధికారులతో బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

పెదపాడులో..

పెదపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పెదపాడు శాఖా గ్రంథాలయంలో సోమవారం గణితంపై శిక్షణ అందజేశారు. గణిత సూత్రాలు, విద్యార్థులకు గణితం తేలికగా అర్థమయ్యేలా క్షేత్రగణితంపై రిసోర్స్‌పర్సన్ ఏ దుర్గ అవగాహన కల్పించారు. అనంతరం కోనే నాగ వెంకట ఆంజనేయులు రచించిన వజ్రాల హారం అనే నీతి కథను విద్యార్థులకు వినిపించారు. విద్యార్థులచే దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమడోలులో జాబ్‌మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన భీమడోలులోని గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ జితేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 748 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ డిప్లొమా, ఫార్మసీ, ఎంబీఏ, పీజీ, బీటెక్ వంటి విద్యార్హతలు ఉండి, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 81848 87146, 77101 77767, 96663 22032లో సంప్రదించవచ్చని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యేవారు తమ బయోడేటా, సర్టిఫికెట్ నకళ్లతో హాజరు కావాలని సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నిడమర్రు ఎంపీడీఓ కార్యాలయంలో యోగా తరగతుల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

నిడమర్రు: విధుల్లో నిత్యం బిజీగా ఉండే ప్రభుత్వ ఉద్యోగులు యోగా సాధన చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని యోగా మాస్టర్ ట్రినర్ పీవీ పెద్దిరాజు అన్నారు. సోమవారం నిడమర్రు ఎంపీడీఓ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తరగతి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాస్టర్ ట్రినర్ పెద్దిరాజు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమారి, ఆయుర్వేద మెడికల్ అధికారి డాక్టర్ కృష్ణ జిజియా బాయి, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

ఉంగుటూరు: యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. సోమవారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వివిధ పంచాయతీల కార్యదర్శులు, అధికారులుతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలు రి కేటగరి చేసే పక్రియ, పీజీఆర్ఎస్, జిఎస్‌డబ్లుఎస్, శానిటేషన్, స్వర్ణపంచాయితీ తదితర ప్రభుత్వ కార్యక్రమాలు పనితీరు పై కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌మనోజు, ఈవోపీర్డీ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

దెందులూరు: మండలంలోని రెండో విడత పైలట్ ప్రాజెక్టు గ్రామాలైన రామారావుగూడెం గ్రామాల్లో భూ హద్దుల నిర్ధారణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని దెందులూరు మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర అన్నారు. సోమవారం రామారావుగూడెం, కంద్రిగనర్సింహపురం గ్రామాల్లో గ్రామ మండల సర్వేయర్లు చేస్తున్న భూమి నిర్ధారణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంద్రిగ నరసింహాపురంలో 95శాతం భూమి హద్దులు నిర్ధారణ పూర్తయిందన్నారు. శ్రీరామవరం గ్రామంలో 60 శాతం ఎప్పటి వరకు హద్దుల నిర్ధారణ పూర్తయిందని, మరో 40 శాతంహద్దుల నిర్ధారణ జరగాల్సి ఉందని వివరించారు.

పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా



అంబర్‌పేటలో రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు తన వంతు కృషి చేస్తున్నామని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. అంబర్‌పేటలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడంతో భాగంగా ఆదివారం భీమడోలు రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన అంబర్‌పేటలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాన్ని పరిశీలించారు. మ్యాప్‌ను పరిశీలించి తహసీల్దార్ బి.రమాదేవి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ స్థాపనకు అవసరమైన 50 ఏకరాల భూమిని గుర్తించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని 50 ఏకరాల విస్తీర్ణం గల భూమి ఒకే చోట ఉన్నట్లయితే ఆ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు తగు చర్యలు చేపడతామన్నారు. తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందన్నారు. ఈ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు కరణం పెద్దిరాజు, వాసురాజు, ప్రత్తి మదన్, పైడిమాల యుగంధర్, ఆజయ్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, తదితరులు

భీమడోలు: అధికారంలోకి వచ్చేందుకు బూటకపు హామీలిచ్చి ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు.భీమడోలు సర్పంచ్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థ రద్దు, సంక్షేమ పథకాలు రద్దు వాటిపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఎండీయూ వ్యవస్థ రద్దును తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశం మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఆర్‌టీఐ నియోజకవర్గ అధ్యక్షుడు అంబటి నాగేంద్రప్రసాద్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, మండల ఎంపీటీసీల ఛాంబర్ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొని కూటమి పాలనపై వారంతా ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నా ఎక్కువగానే ఇస్తామని హామీ ఇచ్చి గెలిచిన తర్వాత వాటిన్నింటిని చాపకింద నీరులా రద్దు చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ రేషన్ సరుకులను అందజేసేందుకు ఎండీయూ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటికే రేషన్‌ను అందజేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలతో పాటు వృద్ధులు, రోగులు, నడవలేని వారికి ఇంటికే వచ్చి రేషన్ ఇవ్వడం ద్వారా వారికి మేలు జరిగిందన్నారు. అలాంటి వ్యవస్థ రద్దు చేసిన చంద్రబాబుకు చరిత్ర హీనుడవుతాడన్నారు. ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే వ్యవస్థ రద్దుపై పునరాలోచించాలని కోరారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఆర్‌టీఐ అధ్యక్షుడు అంబటి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ రేషన్ వాహనాలను నడుపుకుని నాలుగు మెతుకులు తింటూ తన జీవనోపాధిని సాగిస్తున్న వాహనదారుల జీవితాల్లో చీకట్లు అలుముకునేలా ఈ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం బాధకరమన్నారు. ఈ ప్రభుత్వానికి వారి ఊసురు తగులుతుందన్నారు. నియోజకవర్గ గ్రీవెన్స్ అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ మాట్లాడుతూ చంద్రబాబు మోసకారి అని, ఇచ్చిన పథకాలన్నింటిని ఒక్కొక్కటిగా రద్దు చేయడం తగదన్నారు. మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ రేషన్ వాహనాలను రద్దు చేయడంతో ప్రజలంతా రేషన్ దుకాణాల వద్ద క్యూ కట్టాల్సిందేని, దీంతో వారి బాధలు వర్ణనాతీతమన్నారు. మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలన్నీ పేదలను దృష్టిలో ఉంచుకుని అమలు చేశారన్నారు. చంద్రబాబు పాలనలో పేదలను కొట్టి ధనికులకు మేలు చేసే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు ప్రారంభం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ఓపెన్ జిమ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేల్ దాత స్వచ్ఛంద సేవా సంస్థ తపన చైర్మన్ గారపాటి సీతారామాంజనేయులు కలిసి ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఓపెన్ జిమ్ నిర్మాణం ఆవశ్యకతను, వ్యాయామ విద్యార్థుల శిక్షణ ఇతర అంశాలపై వివరించారు. వెంటనే స్పందించిన తపనచౌదరి రూ.5లక్షల నగదును వ్యాయామ కళాశాలలో ఓపెన్ జిమ్ నిర్మాణానికి విరాళం అందజేశారు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నతానియేల్ పనులను పరిశీలించారు.

కోళ్ల పెంపకంపై గిరిజనులకు శిక్షణ

కొయ్యలగూడెం: గిరిజన గ్రామాల్లో సోమవారం పెరటి కోళ్ల పెంపకం, నిర్వహణపై స్థానికులకు అవగాహన కల్పించారు. సరిపల్లి పంచాయతీ వంకబొత్తప్పగూడెం, దిప్ప కాయలపాడు పంచాయతీ కిచ్చప్పగూడేల్లో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయం (వెంకట్రామన్నగూడెం) ఆధ్వర్యంలో గిరిజనులకు బహిరంగ సభ ఏర్పాటు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.దేవివర ప్రసాద్ రెడ్డి నాటు కోళ్ల పెంపకంలో శాస్త్రీయ నిర్వహణను ప్రముఖంగా ప్రస్తావించారు.

వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణ



గ్రంథాలయంలో శాస్త్రవేత్తల జీవిత కథలను అభ్యసిస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం సోమవారంతో ఇరవైనాల్గో రోజుకు చేరుకుంది. విద్యార్థినీ విద్యార్థులతో సైంటిస్టుల జీవిత చరిత్రల పుస్తకాలను, కథల పుస్తకాలను చదివించి శాస్త్రవేత్తల వివరాలను లైబ్రేరియన్ యు.రాముడు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థులు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు కనుగొన్న పరికరాల గురించి తెలుసు గాని వారి జీవిత చరిత్రలను అభ్యసించడం ఆనందంగా ఉందన్నారు. పుస్తక సమీక్ష విరామం అనంతరం యోగాపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బలుసు నాగేశ్వరరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. సిరాజ్ విద్యార్థులకు చెస్ పోటీల నిర్వహణ నిమిత్తం చెస్ ప్రాక్టీస్ చేయించారు. విద్యార్థులకు వారు స్వీట్లు పంచారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



భీమడోలులో కోర్టు వెళ్లే దారిలో ఏర్పడిన గోతులు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

భీమడోలు: భీమడోలులోని కోర్టుకు వెళ్లే దారి అధ్వాన్నంగా మారింది. అదమరిస్తే అంతే సంగతులు అన్న చందంగా మారింది. తరుచుగా పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భీమడోలులోని బీఎస్ఎన్ఎల్, కోర్టుకు వెళ్లాలంటేనే ఈ గోతులతో నిండిన రోడ్డును దాటుకుని వెళ్లాల్సిందే. నిత్యం ఈ రోడ్డు వెంబడి అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారి నుంచి ఈ రోడ్డు వైపుగా వెళ్లే కూడలి వద్ద రోడ్డుకు గుంతలు పడి శిథిలావస్థకు చేరింది. దీనికి తోడు వర్షాలు పడుతుండడంతో ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడి పోతున్నారు. అదమరిస్తే పక్కనే ఉన్న డ్రైయిన్‌లోకి పడాల్సిందే. ఇకనైనా ఆ ప్రాంతంలో కల్వర్టును నిర్మిస్తే ప్రమాదాలు నివారించుకోవచ్చునని పలువురు కోరుతున్నారు. శాశ్వత పరిష్కారానికి పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.లింగరాజు, నాయకులు కట్టా భాస్కరరావు, ముప్పిరిశెట్టి పానకాలు, గోగులమూడి ప్రసాదరావు ఆదివారం డిమాండ్ చేశారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి

రజక జన సంఘం అధ్యక్షుడు కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజకుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, గత ప్రభుత్వాలు ఇచ్చిన జీఓలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రజక జన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య ఆరోపించారు. రజక జన మహాసభ ఏలూరులోని జిల్లా రజక జన సంఘ కార్యలయంలో సోమవారం యూత్ కార్యదర్శి విటాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రజకుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సభలో కట్లయ్య మాట్లాడుతూ గ్రామాల్లో చెరువుల లీజులు, పలు గ్రామాల్లో రజకులకు వృత్తి చెరువులు కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందని అన్నారు. రజకులకు సాంఘిక రక్షణతోపాటు ఎస్సీల్లో చేర్చాలని కోరారు. గ్రామాల్లో చెరువులు, రజకులకు కేటాయించిన చెరువు గట్టు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. 1973లో స్థాపించిన రజక జన సంఘం రజక సమస్యలపై పోరాతోందని వివరించారు. ఉమ్మడి జిల్లాలో 909 చెరువులు ఉండగా, కేవలం 400 గ్రామాల్లోనే చెరువులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంతి భవనాలు, విద్యుత్ కనెక్షన్, లీజులు, సఫలీలు తదితర సమస్యలు వెంటాడుతున్నాయని చెప్పారు. రజకులు వృత్తి చేసుకునే చెరువులను పంచాయతీలు తీర్మానాలు ఇచ్చినప్పటికీ అధికారులు గ్రామపంచాయతీలు రజకులకు వ్యతిరేకంగా వ్యవహరించడం వల్ల కోర్టులను ఆశ్రయించాల్సి వస్తుందని అన్నారు. సభలో రజక సంఘం నాయకులు పశివేదల శ్రీనివాసరావు, పున్నపు నరసింహారావు, పి.లక్ష్మీప్రసన్న, యలమంచిలి నాగ శేషు, చీపురుపల్లి అప్పారావు, ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్వాసితులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆయన కోరారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన ఈ డిమాండ్లు చేశారు. 29న జరిగే పార్టీ మండల మహాసభను జయప్రదం చేయాలని కార్యకర్తలను కోరారు.